క్లుప్తంగా

సామాజిక తనిఖీల ప్రజావేదిక వాయిదా

బొబ్బిలి రూరల్: ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలకు సంబంధించిన ప్రజావేదిక కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. తుపాను వర్షాల కారణంగా వాయిదా వేయడం జరిగిందని, అధికారులు, ప్రజలు గమనించాలని కోరారు.

14న కోడూరుమాత యాత్ర


కోడూరుమాత

బాడంగి: మండలంలోని కోడూరు పుణ్యక్షేత్రంలో పరిశుద్ధ మరియ కోడూరుమాత యాత్ర మహోత్సవం ఈ నెల 14వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఫాదర్ పి.యుగల్‌కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. వేడుకల సందర్భంగా ఈ నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు నవదిన ప్రార్థనలు, జపమాల, దివ్యపూజలు జరుగుతాయన్నారు. ఉత్సవం రోజు ఉదయం 7 గంటలకు మొదటి పూజ, 9 గంటలకు రెండో పూజ, 11 గంటలకు మూడో పూజ, మధ్యాహ్నం ఒంటిగంటకు నాలుగో పూజ ఉంటుందన్నారు. అనంతరం కోడూరుమాత తేరు ప్రదక్షిణ ఉంటుందని, సాయంత్రం 6 గంటలకు ఆరో పూజ ఉంటుందన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్) సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ ఏ విధంగా సోకుతుంది, హెచ్‌ఐవీ బాధితులతో ఏ విధంగా నడుచుకోవాలన్న విషయాలను వివరించారు. కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయ నిధి ఏర్పాటు

బొబ్బిలి: లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయ నిధి ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. సహాయం చేయాలనుకునే వారు అకౌంట్ నంబర్ 62109367386(ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్ 0020072)కు నగదు జమ చేయాలని కోరారు. చెక్కులు పంపించాల్సిన వారు లోక్‌సత్తా పార్టీ, పోస్ట్‌బాక్స్ నంబర్ 100, ఖైరతాబాద్, పిన్‌కోడ్ నంబర్: 500004, హైదరాబాద్ అడ్రస్‌కు పంపించాలన్నారు. ఇదిలా ఉండగా, గాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు.

విరాళం అందజేత


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, మెప్మా సిబ్బంది

బొబ్బిలి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు సేకరించిన విరాళాలను ఎమ్మెల్యే బేబీనాయనకు అందజేశారు. పట్టణంలోని ఆయన నివాసానికి సోమవారం వెళ్లి, రూ.1,37,443లను చెక్కు రూపంలో అందించి, ప్రభుత్వానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్ముంనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ



రాజాం సిటీ: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మారుతీనగర్‌లో చేసిన దీపాలంకరణ చూపరులను ఆకట్టుకుంది. కాలనీకి చెందిన భక్తులంతా 5001 దీపాలతో శివలింగం, త్రిశూలం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలు వెలిగించి, దైవం పట్ల తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం) వసతిగృహం సహా ప్రభుత్వ పాఠశాలల్లోని స్టోర్‌రూమ్‌ల్లో ఎంపీడీవో పి.రవికుమార్, ఎంఈవో లక్ష్మణరావులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు నిల్వలపై ఆరాతీసి, వర్షాల కారణంగా ఏవైనా దెబ్బతిన్నాయా లేదా అనే విషయం పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టాలని తెలిపారు. ప్రతీ గది పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షం తగ్గింది.. నష్టం మిగిలింది!

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరిపిలేని వర్షాలు విస్తారంగా కురిశాయి. నదులు, వాగులు, వంకలు వరదనీటితో పోటెత్తాయి. కొన్నిచోట్ల కాలువలు, చెరువులకు గండ్లు పడడంతో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీటమునిగాయి. మరికొన్ని చోట్ల రోడ్లు, వంతెనల మీదుగా వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారానికి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ నష్టాన్ని అంచనా వేశారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


సంతకవిటి: రామారాయపురం వద్ద నీటమునిగిన పంటపొలాలు (ఇన్‌సెట్లో) వరదనీటిలోని పంటపొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, కలెక్టర్ బీఆర్ అంబేద్కర్


బాడంగి: తెర్లాం మండలంలోని నందిగాం గ్రామంలోకి వచ్చిన వరదనీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన


బొబ్బిలి రూరల్: వరదనీటిలోని పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్


రేగిడి: బొడ్డవలస వద్ద భారీ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు ఎల్లారావు


బాడంగి: భీమవరం-చినభీమవరం రోడ్డులో ధ్వంసమైన పాల్తేరు కాలువ కల్వర్టు


బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలోకి చేరిన వర్షపునీటిని తొలగిస్తున్న సిబ్బంది


బొబ్బిలి: ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు


రేగిడి: ట్రాక్టరుపై రేగిడి గ్రామంలోని వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్


రేగిడి: అంబాడ వద్ద చెరువును తలపిస్తున్న పంటపొలాలు


రాజాం: కంచరాం వద్ద చింతగెడ్డ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు రాజు తదితరులు


బొబ్బిలి: పాతబొబ్బిలి రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి


బాడంగి: వరదలకు అధ్వానంగా తయారైన ముగడ-భీమవరం తారురోడ్డు

ఆకట్టుకుంటున్న గణనాథులు


బాడంగి: ముగడ చేనేత కాలనీలో కొలువైన నందివాహన గణపతి

బొబ్బిలి/బాడంగి/రేగిడి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. విభిన్న రూపాల్లో మంటపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుని ప్రతిమలను చూసి తరించేందుకు భక్తులు పోటీపడుతున్నారు. దర్శనానంతరం అత్యంత భక్తిశ్రద్ధలతో లంబోదరుడిని పూజిస్తున్నారు.


బొబ్బిలిలోని ఏడో వార్డులో శ్రీరాముడి రూపంలో గణనాథుడు

15న వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ఈ నెల 15వ తేదీన 'మానవ తప్పిదాల వల్ల ఏర్పడే ప్రకృతి విపత్తులు–నివారణ చర్యలు' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని ఆ సంస్థ సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి సోమవారం తెలిపారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగంలో, 9, 10 తరగతుల విద్యార్థులకు సీనియర్ విభాగంలో వ్యాసరచన పోటీలు ఉంటాయని, అలాగే ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9441058519, 8500889795, 8897362962ను సంప్రదించాలని కోరారు.

ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు..

రాజాం సిటీ: వినాయక చవితి ఉత్సవాల్లో వినియోగించాలని చూస్తున్న డీజేలకు ఎటువంటి అనుమతి లేదని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలియజేశారు. రాజాం పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎవరైనా ఎక్కడైనా డీజేలు వినియోగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మైకు పర్మిషన్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే..


శంబంగి వెంకట చినఅప్పల నాయుడు, మాజీ ఎమ్మెల్యే.

బొబ్బిలి : తుపానులను ముందుగానే పసిగట్టి సమాచారం అందించే అత్యాధునిక టెక్నాలజీ మన దగ్గర ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా విజయవాడను వరదలు ముంచెత్తడం విచారకరం. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే.. ముందుగానే ప్రజలను అప్రమత్తం చేయాల్సింది. సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనలో విఫలమయ్యారు. సర్కారు నిర్లక్ష్యం వల్లే ఎంతో మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఎన్నో ప్రాంతాలు జలవలయంలో చిక్కుకుని ఇప్పటికీ తేరుకోని దుస్థితిలో ఉన్నాయి. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోవిడ్ వంటి భయంకరమైన విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొని, ఎంతోమంది ప్రజల ప్రాణాలు కాపాడారు. ఆయన సేవలకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభించింది. ఇప్పటి వరద విపత్తుకు మాత్రం ప్రభుత్వమే ముమ్మాటికీ బాధ్యత వహించాలి. తక్షణమే బాధితులకు న్యాయం చేయాలి.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

రాజాం సిటీ: స్థానిక కోర్టు సముదాయంలో ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ కోరారు. కోర్టు ఆవరణలో పోలీసులతో సోమవారం సమావేశమైన ఆయన.. వీలైనన్ని కేసులు పరిష్కరించే దిశగా పోలీసులు చొరవ చూపాలన్నారు. రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులన్నింటినీ పరిష్కరించనున్నామని, దీనిపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, పీపీ కె.సూర్యకుమార్, రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎక్సైజ్ సీఐ బి.శ్రీధర్, రాజాం, సంతకవిటి, వంగర, రేగిడి పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

నదీతీరాలకు వెళ్లకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి

రామభద్రపురం: తుపాను కారణంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నదులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, నదీతీరాలకు ప్రజలు వెళ్లకుండా చూడాలని ఎంపీడీవో రమామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణతో కలిసి సోమవారం మీడియాతో మాట్లాడిన ఆమె.. రెవెన్యూ, వ్యవసాయ, వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తమై ఎక్కడా ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, అవసరమైతే సహాయక చర్యలు అందించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరా నిలిచిపోతే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, కరెంట్ సరఫరాను పునరుద్ధరించాలని తెలిపారు.

వినతిపత్రం అందజేత

రామభద్రపురం: జాతీయ రహదారిపై నిర్మించిన కల్వర్టు కారణంగా ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయని, ఆ సమస్యను పరిష్కరించాలని రామభద్రపురం రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి సోమవారం వెళ్లి, తహసీల్దారు సులోచనరాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రామభద్రపురం గ్రామ సమీపంలోని సాలూరు వెళ్లే రూట్‌లో 26వ నంబరు జాతీయ రహదారిపై కల్వర్టు నిర్మాణ పనుల సమయంలో కాంట్రాక్టరు అక్కడ పెద్దఎత్తున మట్టి వేయడంతో అక్కడి సాగునీటి కాలువ పూడ్చుకుపోయిందన్నారు. దీంతో ప్రతి ఏడాది వర్షపునీటితో పాటు, పొలాలపైన పైన ఉన్న పూడివాని చెరువు మదుముల ద్వారా వచ్చే నీరు బయటకు పోయే మార్గం లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో పంటపొలాలు నీటమునుగుతున్నాయన్నారు. అక్కడి మట్టిని తొలగించి పంట పొలాల ముంపు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మూడడ్ల కృష్ణ, పూడి వెంకటరావు, రెడ్డి అప్పలనాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారు సులోచనరాణికి వినతిపత్రం అందజేస్తున్న రామభద్రపురం రైతులు

కాశిందొరవలసలో విలీనం చేయండి

బొబ్బిలి రూరల్: మండలంలోని సియోనువలస, దేవునివలస, కొత్తచెలికానివలస తదితర గిరిజన గ్రామాలను కాశిందొరవలస గ్రామ పంచాయతీలో విలీనం చేయాలని సర్పంచ్ కరణం దాలమ్మ, ఆయా గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం వెళ్లి, ఎంపీడీవో రవికుమార్‌ను కలిసి తమ విజ్ఞప్తిని తెలిపారు. తమ గ్రామాలకు పంచాయతీ గుర్తింపు లేనందున ప్రభుత్వం నుంచి అందాల్సిన అనేక సంక్షేమ పథకాలు అందడం లేదని, తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలను కాశిందొరవలస పంచాయతీలో విలీనానికి సర్పంచ్ అంగీకారం తెలిపారన్నారు. స్పందించిన ఎంపీడీవో.. గ్రామ సభ నిర్వహించుకుని, ప్రజలందరి ఆమోదంతో తీర్మానం చేసి తమకు అందిస్తే ఉన్నతాధికారులకు విలీన ప్రతిపాదనను పంపుతామని బదులిచ్చారు. త్వరలోనే గ్రామసభ నిర్వహిస్తామని, అధికారులంతా సహకరించాలని సర్పంచ్ కోరారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

రోడ్లు ఇలా.. ప్రయాణం చేసేదెలా..?

రామభద్రపురం: మండల కేంద్రంలోని పలు జాతీయ, అంతర్‌రాష్ట్ర రహదారులు గుంతలమయంగా మారాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై గుంతల్లోకి పెద్దఎత్తున వరదనీరు వచ్చి చేరుతుండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పారాది వంతెన ఇటీవల పాడవడంతో అటువైపుగా వెళ్లాల్సిన భారీ వాహనాలను రామభద్రపురం మీదుగా బాడంగి వైపు వెళ్లే రాష్ట్ర రహదారి మీదుగా మళ్లిస్తున్నారు. దీంతో ఆ రోడ్డు అంతా ధ్వంసమై ఆ దారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల ఓ పెద్ద లారీ ఆ గుంతల్లో దిగి బోల్తాపడిన ఘటన జరగ్గా, మరెన్నో చిన్న చిన్న వాహనాలు తరచూ ఆ రోడ్డులో అదుపుతప్పి కింద పడడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రామభద్రపురం గ్రామం మధ్య నుంచి సాలూరు వెళ్లే రోడ్డు అయితే మరీ దారుణం.. పూర్తిగా గుంతలమయమైన ఆ రోడ్డు ఏ చిన్నపాటి వర్షం కురిసినా చెరువును తలపిస్తోంది. ఇదే మార్గంలో గుంతలను తప్పించబోయే క్రమంలో కొన్ని వందలాది వాహనాలు బోల్తాపడిన ఘటనలు కోకొల్లలు. ఆయా రోడ్ల దుస్థితిపై అధికారులను సంప్రదించినా ఫలితం లేదని స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు ఇలా ఉంటే ప్రయాణం చేసేదెలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కొత్త రోడ్లు వేయకపోయినా కనీసం రోడ్లపై ఉన్న గుంతలనైనా పూడ్చివేయాలని అభ్యర్థిస్తున్నారు.


రామభద్రపురం నుంచి బాడంగి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు


గుంతలమయమైన రామభద్రపురం మధ్య నుంచి సాలూరు వెళ్లే రోడ్డు

నీటి సరఫరా పునరుద్ధరణ

బొబ్బిలి: వరదల కారణంగా స్థానిక పట్టణ సమీపంలోని గ్రోత్‌సెంటర్‌లో ఉన్న పరిశ్రమలకు నీరందిస్తున్న నీటి పంపిణీ వ్యవస్థ పాడైంది. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారి బడగల హరిదరరావు అప్రమత్తమై, పంప్‌హౌస్‌కు సోమవారం వెళ్లి, మరమ్మతులు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో పరిశ్రమల యజమానులు సదరు అధికారి పనితీరును అభినందించారు.

అన్నదానం

వంగర: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మద్దివలస గ్రామంలో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కలమటి రామకృష్ణ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఈ విగ్రహం వద్ద ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ప్రత్యేక పూజలు చేసి, అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

సంతకవిటి: మండలంలోని రంగారాయపురంలో వినాయక నిమజ్జనోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఉదయం పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం అనంతరం సాయంత్రం గణపతి విగ్రహ ఊరేగింపు చేపట్టారు. రాత్రి ప్రతిమ నిమజ్జనం చేశారు.